## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సాప్ ద్వారా పంపగలరు

RNI.No.TGTEL/25/A1964

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక

## రిపోర్టర్లు కావలెను

ప్రజాస్వామ్యానికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు | మండల | నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 62 ఎడిటర్ :పెనుగొండ సతీష్ బుధవారం 8 అక్టోబర్ 2025 పేజీలు 8 వెల 5.00

### పత్తి రైతులకు

# అండగా ఉంటాం

- సిసిఐకి మాత్రమే పంటలను అమ్ముకోవాలి
- కేంద్రమంత్రి గిరిరాజ్‌తో కిషన్ రెడ్డి చర్చలు



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబర్ 7 : పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి భరోసా కల్పించారు. అన్నదాతలు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి పంటని అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పంటని అమ్మడానికి 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని.. ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కిషన్‌రెడ్డి

2లో

# పొన్నం,అడ్లూరి మధ్య వ్యవహారం

- పరస్పర విమర్శలతో వేడెక్కిన రాజకీయం
- సమన్వయంతో కలసి ముందుకు వెళ్లాలన్న పిసిసి చీఫ్
- కాంగ్రెస్ అగ్రనేతలను కలిసి ఫిర్యాదు చేస్తానన్న అడ్లూరి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 7 : జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రి పొన్నం వ్యాఖ్యలపై తాజాగా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ.. ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవంగా ఉంటుందన్నారు. మాదిగలు అంటే మీకు అంత చిన్న చూపా, అని సీరియస్ అయ్యారు. అన్న మాటను సమర్థించుకుని ఇప్పటి వరకు రియాక్ట్ కాకుండా ఉన్నావంటే ఈ విషయం నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను అని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. సహచర మంత్రిని, ఎస్సీ సామాజిక వర్గం నేతను ఆ మాట అంటుంటే చూస్తూ ఉంటావా అని మంత్రి వివేక్ వెంకటస్వామిని మంత్రి లక్ష్మణ్ కుమార్ నిలదీశారు. ఇక, మంత్రి పొన్నం ప్రభాకర్–అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎపిసోడ్ పై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ రంగ ప్రవేశం చేశారు. ఇద్దరు మంత్రులకు ఫోన్ చేసి ఇరువురు సంయమనం పాటించాలని చెప్పినట్లు సమాచారం. అడ్లూరినీ ఉద్దేశించి పొన్నం కామెంట్స్ చేశారని ప్రచారం.. అడ్లూరిని ఉద్దేశించి మాట్లాడలేదని పొన్నం వివరణ ఇచ్చారు. పొన్నం కామెంట్స్‌ని తప్పు పట్టిన మంత్రి శ్రీధర్ బాబు.. పార్టీకి, ప్రభుత్వానికి ఇది మంచిది కాదంటూ శ్రీధర్ బాబు హితవు పలికారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మనస్పర్థలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. ఈ మేరకు మీడియం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మహేష్ గౌడ్ ఫోన్ చేశారు. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని

2లో

### తెలంగాణలో

# 80 శాతం పత్తి కొనుగోళ్లు




- సిసిఐ ద్వారానే నేరుగా కొంటాం
- 122 కొనుగోలు సెంటర్ల ఏర్పాటు
- కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబరు 7 : తెలంగాణలో 80 శాతం పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణలో 20 లక్షల మంది పత్తి రైతులు ,18 లక్షల హెక్టార్లలో పత్తి పంట పండిస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు సహకారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక అప్లికేషన్ ప్రారంభించిదని... రైతులు అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో గిరిరాజ్ సింగ్ మాట్లాడారు. గతంలో పత్తిని ఎంత సేకరించామో.. ఈ ఏడాది కూడా అలానే పత్తిని సేకరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్ల కోసం గతేడాది 110 సెంటర్లు ఉన్నాయని.. ఇప్పుడు122 సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనను కోరారని చెప్పుకొచ్చారు. గతంలో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని.. ఇప్పుడు కూడా దుర్వినియోగం అవుతున్నాయని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదని.. రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం నిలవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎంత పత్తి ఉత్పత్తి అయితే అంత కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా

2లో



కొమురం భీమ్

# ఆశయసాధనకు కృషి

- ఆదివాసీల అభివృద్ధితోనే ఇది సాధ్యం
- వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన మంత్రి సీతక్క

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 7 : ఆదివాసీల అభివృద్ధితోనే కొమరం భీం ఆశయాలు నెరవేరుతాయని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. ఆయన ఆశయాల కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఐటీడీఏ ఏర్పాటులోనూ కొమరం భీం స్ఫూర్తి ఉందన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఆ మహోనీయుడు విగ్రహానికి మంత్రి సీతక్క పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొమరం భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని.. దానికి అనుగుణంగా ప్రత్యేక జీవో ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ

2లో

### నగరంలో బస్ ఛార్జీల

# పెంపు దారుణం

- 9న ఛలో బస్ భవన్‌కు బిఆర్ఎస్ పిలుపు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 7 : ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్కి పిలుపునిచ్చింది. ఛార్జీల పెంపు పేదలపై భారం పడుతందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు

2లో

### నవీన్ యాదవ్ వైపే

# కాంగ్రెస్ మొగ్గు...!

- అధిష్టానానికి పేరు సిఫార్సు
- పోటీ నుంచి తప్పుకున్న బొంతు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు 7 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్‌కి లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో నవీన్ యాదవ్ వైపు సీఎం రేవంత్ రెడ్డి మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో నుంచి తప్పుకున్నట్లు బొంతు రామ్మోహన్ ప్రకటించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయిస్తుందని బొంతు రామ్మోహన్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తాను పనిచేస్తానని బొంతు రామ్మోహన్ ప్రకటించారు. మరోవైపు.. జూమ్ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీలు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చేసిన సర్వే రిపోర్టులు , అభ్యర్థుల సామాజిక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అయితే, రెండు పేర్లతో ఏఐసీసీకి సిఫారసు చేయాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు.

### బిసి రిజర్వేషన్లపై

# నేడు హైకోర్టులో విచారణ

- మంత్రులు అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష
- అభిషేక్ సింఘ్వీతో తాజాగా చర్చ



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 7 : బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. బుధవారం హైకోర్టులో కేసు విచారణకు రానున్న సందర్భంగా మంత్రులు, న్యాయనిపుణలుతో చర్చించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా

2లో

# పిసి ఘోష్ కమిషన్‌పై విచారణ

- 12వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 7 :కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరఫున లాయర్ నిరంజన్ రెడ్డి

2లో

### స్థానిక ఎన్నికల్లో పోటీకి

# తీన్మార్ మల్లన్న సిద్ధం

- పార్టీకి గుర్తు కేటాయించాలని హైకోర్టులో పిటిషన్
- తగు చర్యలు తీసుకోవాలసి ఇసిని ఆదేశించిన హైకోర్టు




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 7 : తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బిసిలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడ్డ ఈ పార్టీ రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పార్టీ గుర్తింపు, పార్టీ గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ

2లో

# ఆర్టీసీ ఛార్జీల పెంపు దారుణం

- ప్రజలపై భారం మోపడమేనన్న కెటిఆర్




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు 7 : తెలంగాణలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నిర్ణయాన్ని

2లో

# పారదర్శకంగా ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తు

## - ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు: కేంద్రమంత్రి

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబర్ 7 : అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంపై నిష్పక్షపాత దర్యాప్తు సాగుతోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. దర్యాప్తుపై వస్తోన్న ఆందోళనలను రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. దర్యాప్తులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని.. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతోందన్నారు. విమాన ప్రమాదంపై 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఇచ్చిన ప్రాథమిక నివేదికపై విమర్శల నేపథ్యంలో కేంద్ర మంత్రి ఇలా స్పందించారు. విమాన ప్రమాదాల వ్యవహారాలను చూసే బాధ్యత ఏఏఐబీది. కేవలం వాస్తవాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. ఎవరి ప్రభావం దీనిపై ఉండదు. నిబంధనల ప్రకారం.. పారదర్శకంగా, స్వతంత్ర పద్ధతిలో దర్యాప్తు జరుగుతోంది. ప్రాథమిక నివేదికపై వ్యాఖ్యలు చేయడం తొందరపాటే అవుతుంది. అసలేం జరిగిందనే విషయంపై స్పష్టత రావాలంటే తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దిల్లీలో ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విలేకరులతో మాట్లాడారు. దేశంలోని అన్ని బోయింగ్ 787 విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, ఎలక్ట్రికల్ వ్యవస్థల పనితీరుపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ 'ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్(ఎఫ్ఐపీ)' ఇటీవల డీజీసీఏకు లేఖ కూడా రాసిన విషయం తెలిసిందే. బోయింగ్ విమానాల్లోని భద్రత ప్రమాణాలపై గతంలోనూ తాము ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని అందులో గుర్తు చేసింది. ఈ క్రమంలోనే పౌర విమానయాన శాఖ మంత్రి క్లారిటీ ఇచ్చారు.

# ఆప్ నేత కేజ్రీవాల్‌కు ఊరట

## - ఢిల్లీలో ధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళా కేటాయింపు

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబర్ 7 : ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఎట్టకేలకు అధికారిక నివాసం కేటాయించింది. ఇకపై 95, లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళాలో ఆయన ఉండనున్నారు. దిల్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం గత ఏడాది అక్టోబరులో ఆయన సీఎం అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. దిల్లీలో మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ వసతి కేటాయించే నిబంధన లేదు. దీంతో ఆయన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించిన లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న 5వ నంబరు బంగళాలో తాత్కాలికంగా ఉంటున్నారు. ఈక్రమంలోనే గుర్తింపుపొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడిగా కేజ్రీవాల్ కు తగిన నివాసం కేటాయించాలంటూ ఆప్ న్యాయపోరాటం చేసింది. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం నూతన బంగళాను కేటాయించింది. బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన 35, లోధి ఎస్టేట్‌లోని బంగళాను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆప్ కోరింది. కానీ, దాన్ని జులైలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించింది. కేజ్రీవాల్‌కు ఇప్పుడు కొత్తగా కేటాయించిన ఇంట్లో గతంలో భాజపా నేత, జాతీయ మైనారిటీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు. నూతన నివాసాన్ని కేజ్రీవాల్ దంపతులు ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. పక్కనే ఉన్న 97వ భవనంలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఉంటున్నారు. ఇదిలాఉండగా.. సీఎంగా ఉన్నప్పుడు సివిల్ లైన్స్ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఆరో నంబరు బంగళాను కేజ్రీవాల్ అధికార నివాసంగా ఉపయోగించేవారు. ఆ సమయంలో దానికి అనేక హంగులు చేసి పునర్నిర్మించారు. ఇందులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా విమర్శలు గుప్పించింది. ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది. ఇప్పుడు ఈ భవనాన్ని ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌గా మార్చాలని దిల్లీ లోని భాజపా ప్రభుత్వం యోచిస్తోంది.

# భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

## - ప్రకటించిన నోబెల్ కమిటీ

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబర్ 7 : ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ వరించింది. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్ ఆవిష్కరణకు శాస్త్రవేత్తలు జాన్ క్లార్క్, మైఖేల్ డెవోరెట్, జాన్ మార్టినిస్‌లకు 2025 భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చినట్లు మంగళవారం నోబెల్ కమిటి తెలిపింది. జాన్‌క్లార్క్, మిచెల్ హెచ్.డివోరెట్, జాన్.ఎం మార్టిన్స్‌లు ముగ్గురు ఈ అవార్డును సంయుక్తంగా గెలుచుకున్నారు. నోబెల్ భౌతిక శాస్త్ర బహుమతిని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రదానం చేస్తుంది. బహుమతి గెలుచుకున్న ముగ్గురికి మొత్తం 11 మిలియన్ స్వీడిష్ కిరీటాల (1.2 మిలియన్లు) బహుమతి రానుంది. ఈ మొత్తాన్ని వాళ్లు ముగ్గురు పంచుకో నున్నారు. ఇప్పటికే తొలి నోబెల్ బహుమతి వైద్య రంగంలో ముగ్గురు వైద్యులకు సంయుక్తంగా లభించింది. మిగిలిన విభాగాల్లో నోబెల్ బహుమతుల విజేతల పేర్లను అక్టోబర్ 13వ తేదీ వరకు ప్రకటించనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ మరణం తరువాత ఈ నోబెల్ బహుమతులు అందజేస్తున్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన సంపదలో ఎక్కువ భాగాన్ని వివిధ రంగాలలో బహుమతులను అందజేయడానికి వీలునామా రాశారు. 1895 నాటి ఆయన వీలునామా ప్రకారం.. గత ఏడాదిలో, మానవాళికి గొప్ప ప్రయోజనం చేకూర్చిన వారికి బహుమతులు ప్రదానం చేయాలని ఆయన నిర్దేశిరచారు. ప్రతి ఏడాది డిసెంబర్ 10న నోబెల్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజు ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి. ఈ రోజున నోబెల్ బహుమతులు గ్రహీతలకు ప్రదానం చేస్తారు. మొదటి నోబెల్ బహుమతులు 1901లో ప్రదానం చేశారు. నాటి నుంచి ఏటా అందజేస్తున్నారు. అప్పటి నుంచి కొన్ని సార్లు నోబెల్ బహుమతులు ఇవ్వని సందర్భాలు కూడా ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914 నుంచి 1918 వరకు కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధం 1939 నుంచి 1945 వరకు కొనసాగిన సమయంలో నోబెల్ బహుమతులు ఇవ్వలేదు.

# వాల్మీకి మహర్షి జయంతిలో భద్రాద్రి కలెక్టర్



(ఆకాంక్ష న్యూస్)

భద్రాద్రి-కొత్తగూడెం, అక్టోబర్ 7:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఐడిఓసిలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఛార్జీల పెంపు దారుణం

మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ప్రభుత్వం చార్జీలు పెంచడం అన్యాయం అని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందని, కానీ అదే సమయంలో పురుషులు, విద్యార్థులపై అదనపు భారాన్ని మోపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ఇంట్లో ఒక మహిళ ఉచితంగా ప్రయాణం చేస్తే, కుటుంబంలోని మిగిలిన సభ్యులందరికీ రెండింతలు చార్జీలు కట్టాల్సి వస్తోంది. దీంతో ఒక కుటుంబానికి నెలకు కనీసం ఇరవై రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. ఈ విషయం ఇప్పుడు ప్రతి తెలంగాణ కుటుంబానికీ అర్థమైందని ఆయన అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పథకం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించినట్టు ప్రభుత్వం చెబుతుందేమో కానీ, వాస్తవానికి ఇది ఆర్థిక సమతుల్యతను దెబ్బతీసే నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ ఇప్పటికే ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో ఈ విధంగా వసూళ్లను పెంచడం ప్రజలపై నేరుగా భారం మోపడం అవుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీని బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉన్నా, అది ప్రజల వెన్నుపైన భారం మోపడం ద్వారా సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆర్థిక లోటును పూడ్చుకు నేందుకు ప్రయాణికులను బలితీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం మానేసి, ప్రచారపరమైన పథకాల పేరుతో బడ్జెట్ నష్టాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రజలతో మోసం చేయడమేనని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కూడా ఈ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, చార్జీల పెంపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల జీవన వ్యయాలు ఇప్పటికే పెరిగిపోయాయని, ఇలాంటి చర్యలు సాధారణ కుటుం బాలపై మరింత భారం మోపుతాయని వారు పేర్కొన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలతో ఆర్టీసీ చార్జీల పెంపు అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చావిషయంగా మారింది.

# స్థానిక ఎన్నికల్లో పోటీకి తీన్మార్ మల్లన్న సిద్ధం

మొదటిపేజీ తరువాయి

జరిగింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాగా.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం లక్ష్యంగా ఇటీవల తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీన్మార్ మల్లన్న స్థాపించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణ హోటల్‌లో పార్టీని స్థాపించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండాపై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు. పిడికిలి కింది భాగంలో పార్టీ పేరును ముద్రించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని మల్లన్న కోరడం.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో... మల్లన్నకుఎన్నికల సంఘం ఎలాంటి గుర్తును కేటాయిస్తుందో అన్న ఆసక్తి పెరిగింది.

# పిసి ఘోష్ కమిషన్‌పై విచారణ

మొదటిపేజీ తరువాయి

ఈ విచారణ సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. కమిషన్ నివేదికలో తమ పేర్లు ప్రస్తావించబడిన నేపథ్యంలో ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఉండాలని వారు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సీబీఐకి పంపిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు, ఆ నివేదిక ఆధారంగా నేరుగా చర్యలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ తన స్వతంత్ర విచారణను చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వచ్చే నెల 12న జరగనుంది. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ సీఎస్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది.

# తెలంగాణలో 80 శాతం పత్తి కొనుగోళ్లు

మొదటిపేజీ తరువాయి

ఉందని స్పష్టం చేశారు. రైతులకు స్మార్ట్ ఫోన్స్ లేకుండానే నిధులు వెళ్తున్నాయా అని ప్రశ్నించారు గిరిరాజ్ సింగ్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 నుంచి 2014 వరకు రూ.12, 500 కోట్ల పత్తి కొనుగోళ్లు చేస్తే.. ప్రస్తుతం రూ.73,000 కోట్ల పత్తి కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు కేవలం తెలంగాణ నుంచే జరిగాయని వెల్లడించారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. 2014లో క్వింటా పత్తి ధర రూ.3,700లు ఉంటే.. ఇప్పుడు క్వింటా రూ.7,710ల ధర ఉందని నొక్కిచెప్పారు. మరో గ్రేడ్ రకం గతంలో క్వింటా రూ. 4 వేలు ఉంటే.. ప్రస్తుతం క్వింటా రూ. 8,110లుగా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు మద్దతుగా నిలవాలని సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో ఓ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం క్వాలిటీ సీడ్స్ ఇవ్వాలని గిరిరాజ్ సింగ్ సూచించారు.

# పొన్నం,అడ్లూరి మధ్య వ్యవహారం

మొదటిపేజీ తరువాయి

మహేష్ గౌడ్ సూచించారు. పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడటం తనకురాదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంత్రి వివేక్ లాగా తన దగ్గర డబ్బులు లేవని స్పష్టం చేశారు. తాను మంత్రి కావడం, ఆ సామాజిక వర్గంలో పుట్టడం తన తప్పా.. అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సోనియా, రాహుల్, ఖర్గే, మీనాక్షిని కలుస్తానని వివరించారు. తాను కుర్చీలో కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నారని చెప్పారు. తాను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను ఆదిలాబాద్ పర్యటనలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నేను మంత్రి కావడం.. మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. అయితే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యం అని అన్నారు.



# పత్తి రైతులకు అండగా ఉంటాం

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్‌రెడ్డి. పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జౌలి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశర చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు కిషన్‌రెడ్డి. రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన తీసుకురావాలని కోరారు. అందరూ ఒకేసారి పత్తిని జిన్నింగ్ మిల్స్‌కి తీసుకురావడంతో పంట కొనుగోలు చేయడంలో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగానే పత్తిని ఏరోజు తీసుకువస్తారనేది రిజిస్టర్ చేసుకుంటే సమస్య ఉండదని చెప్పుకొచ్చారు. సీసీఐ నుంచి నేరుగా రైతుల ఖాతాకు డబ్బు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కాటన్ రేటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులని పత్తిలో తేమ తగ్గించేందుకు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయాలని సూచించారు. మహారాష్ట్ర అకోలాలో హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

# నగరంలో బస్ ఛార్జీలపెంపు దారుణం

మొదటిపేజీ తరువాయి

చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ఆర్టీసీ డ్రైవర్లతోనే ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలు నడపడానికి ఆర్టీసీ ఉద్యోగులకు ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు.

# కొమురం భీమ్ ఆశయసాధనకు కృషి

మొదటిపేజీ తరువాయి

మహానాయకుడి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కొమరం భీం పోరాటం.. ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటమని చెప్పుకొచ్చారు. మా గుడాల్లో మా రాజ్యం కావాలని మా అడవుల మీద మాకు హక్కు ఉండాలని పోరాటం చేశారని గుర్తు చేశారు. వారి పోరాటాల ఫలితంగానే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, తొలి ప్రధాని నెహ్రూ ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగంలో ప్రత్యేక రక్షణలు కల్పించారని తెలిపారు. కొమరం భీం స్ఫూర్తితో గిరిజన మంత్రిత్వ శాఖ ఏర్పాటు అయ్యిందని వెల్లడించారు. రాజ్యాంగంలో ఈశాన్య రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించారన్నారు. మైదాన ప్రాంత రాష్ట్రాల్లోని ఆదివాసీల పరిరక్షణ కోసం షెడ్యూల్ 5ను రాజ్యాంగంలో చేర్చారని చెప్పారు.

# బిసి రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

మొదటిపేజీ తరువాయి

సమాంతరంగా కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరపున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వి, సిద్దార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి తో ఫోన్ లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింఘ్విని కలసి ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు.

# రైలు నుంచి అన్నదమ్ముల తోసివేత

మొదటిపేజీ తరువాయి

ఘర్షణకు కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందగా అన్న కోమాలోకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం అతడికి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న సికింద్రాబాద్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# 16న మోడీ శ్రీశైలం పర్యటన ఖరారు

మొదటిపేజీ తరువాయి

అనంతరం మాధవ్ మాట్లాడుతూ.. సరళీకృత జీఎస్టీ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమానికి ఈనెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పాల్గొంటారని తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ మొదటిసారిగా శ్రీశైలం రావడం శుభ పరిణామమని అన్నారు. ప్రధాని శ్రీశైలం పర్యటనతో క్షేత్ర వైభవం మరింత పెరుగుతుందన్నారు. శ్రీశైలం ప్రాంతం యొక్క విశిష్టత టూరిజం అభివృద్ధి ఈ ప్రాంతం యొక్క విశేషాలు ప్రపంచానికి తెలిసే అవకాశం ఉందని చెప్పారు. శ్రీశైలం మల్లన్న దర్శనం అనంతరం శివాజి స్ఫూర్తి కేంద్రానికి ప్రధాన మంత్రి మోదీ చేరుకుంటారని మాధవ్ పేర్కొన్నారు.

# పార్టీకి వ్యతిరేక చర్యలు చేస్తే ఉపేక్షించేదే లేదు

## బీజేపీ నాయకులు హెచ్చరిక



రామగిరి (ఆకాంక్ష) : రామగిరి మండలంలో స్థానిక సంస్థ ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి పెద్దపల్లి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. సీనియర్ నాయకుడు మట్ట శంకర్‌తోపాటు పలు మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పార్టీ నిర్ణయాలు, మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక్కొక్కరు బీజేపీ జెండాను గ్రామ స్థాయిలో ఎగర వేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జడ్పిటీసీ స్థానానికి సంబంధించిన అభ్యర్థుల అభ్యర్థనలు ఈ సమావేశంలో స్వీకరించారు. బీజేపీ తాత్విక దిశగా కృషి చేసే వారికి ప్రాధాన్యత కల్పిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొందని. మోడీ ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని రాబోయేది బీజేపీ ప్రభుత్వమే" అని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదే. గ్రామ గ్రామాన బీజేపీ చాప కింద నీరు లా విస్తరిస్తోందని. పార్టీ వ్యతిరేక చర్యలు చేసిన వారిని కఠినంగా ఎదుర్కొంటాం" అని హెచ్చరించారు. నాయకులు రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మోడీ ప్రభుత్వం చేపట్టిన ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, గ్రామపంచాయతీ అభివృద్ధి, జీఎస్టీ రేట్ల తగ్గింపు, దేశ భద్రత వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలాన్ని మరింత పెంచాలని సూచించారు. రామగిరి ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని, ఈ విషయాన్ని ప్రతి ఇంటికీ తెలియజేయాలని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు పొన్నం సదానందం, పిండి సదానందం, ప్రధాన కార్యదర్శులు తొట్ల రాజు, మద్దూరి సాగర్, ఉపాధ్యక్షులు నాంసాని మహేష్, పిడుగు రాజు, కార్యదర్శులు కొత్త కమలాకర్, బత్తిని శివకుమార్, పట్టణ అధ్యక్షుడు శివ, మహిళా మోర్చా నాయకురాలు రొడ్డ వరలక్ష్మి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మైదం సందీప్, ఎస్సీ మోర్చా నాయకుడు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### దళితులు ఏ స్థాయికి ఎదిగినా

# వివక్ష తప్పడం లేదు

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్...



హైదరాబాద్(ఆకాంక్ష) : సమాజంలో దళితులపై కొనసాగుతున్న వివక్షతను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "దళితులు సమాజంలో ఎంత ఎదిగినా, ఏ స్థాయికి చేరినా, ఇప్పటికీ వారికి చులకనగా వ్యవహరిస్తున్న దృశ్యాలు బాధాకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కాలం నుంచి నేటివరకు దళితులపై జరుగుతున్న కులవివక్ష అంతరించలేదని, ఇది భారత సమాజంపై మచ్చగా మిగిలిందని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజ్యాంగ హక్కులు సరిపోవు, వాటిని అమలు చేసే ఆచరణలో మార్పు రావాలని సూచించారు. సమాజంలో నిజమైన మార్పు రావాలంటే ఆర్థిక మరియు సామాజిక సమానత్వం సాధించాలి. అప్పుడు మాత్రమే కులవివక్ష అనే వ్యాధి పూర్తిగా పోతుంది," అని కొప్పుల ఈశ్వర్ అభిప్రాయపడ్డారు. దళితులు ప్రభుత్వ, ఉద్యోగ, ఉన్నతాధికార వర్గాలలో కీలక పదవులు చేపట్టినా కూడా ఇంకా వివక్ష ఎదుర్కోవడం బాధాకరమని అన్నారు. సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన దాడి, రాష్ట్ర దళిత మంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ు ఇవన్నీ జాతి ఆధారిత అవమానాలకే నిదర్శనమని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు, దాడులను ఎలాంటి సభ్యసమాజం కూడా సమర్థించలేం. వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలి," అని ఆయన డిమాండ్ చేశారు. బహుజన వాదం పేరుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు తమ హక్కుల కోసం ఒకే వేదికపై పోరాటం చేయడం సమాజంలో సమానత్వానికి దారితీసే మార్గమని కొప్పుల గుర్తు చేశారు. దళితులపై కొనసాగుతున్న అసమానతలు తక్షణమే ఆగి, సమానత్వ భావన పెంపొందే సమాజం నిర్మాణం కావాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు.

# నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

- ఎన్నికల విధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగించేలా శిక్షణ కార్యక్రమాలు
- నామినేషన్ల స్వీకరణకు మండలాల్లో పటిష్ట ఏర్పాట్లు
- స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్







పెద్దపల్లి, అక్టోబర్ - 07(ఆకాంక్ష) : నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించి నామినేషన్ స్వీకరణకు మండల కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో అవసరమైన మేర కౌంటర్ లు ఏర్పాటు చేసి సంబంధిత ఎంపిటిసి స్థానాలకు నామినేషన్లు స్వీకరించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ మద్దతు ఎంపీడీఓ, ఎంపీఓలకు అందించాలని అన్నారు. ప్రతి మండలం ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేర అధికారులు నియామకం పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండేలా పటిష్ట శిక్షణ అందించాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాల పై పూర్తి శిక్షణ అందించాలని అన్నారు. మండలాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సంపూర్ణ సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు అందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వీస్ ఓటర్లకు, పీడీ యాక్ట్ కింద అరెస్టైన వారికి, ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయడం జరుగుతుందని, మన ఓటర్ జాబితా పరిధిలో పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాల్సిన వారి పేర్లు రౌండాఫ్ చేసుకోవాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అందించాలని అన్నారు. నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ర్యాలీ , ప్రచారాలు అనుమతి లేవని, అభ్యర్థి తో పాటు 3 మాత్రమే అనుమతించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారానికి అనుమతి మంజూరు చేయాలని, సౌండ్ సెట్, వాహనానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారులకు ఒకే రూట్ లో సమావేశాలు ర్యాలీలో నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ఓట్ల కోసం కుల,మత విద్వేశాలు రెచ్చగొట్టకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. అధికారులు ఎన్నికల విధులను తమకు కేటాయించిన బుక్ లెట్ లోని నిబంధనల ప్రకారం పటిష్టంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, డిపిఓ వీర బుచ్చయ్య, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

## - పెద్దపల్లి అదనపు కలెక్టర్ డి.వేణు



పెద్దపల్లి, అక్టోబర్ 7(ఆకాంక్ష) : మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. మహాకవి వాల్మీకి జయంతి పురస్కరించుకొని మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు పాల్గొన్నారు. మహాకవి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణంతో ముడీబడి ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమని అదనపు కలెక్టర్ తెలిపారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి , కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓదెల లో వాల్మీకి మహర్షి జయంతి



ఓదెల(ఆకాంక్ష) : కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అనే సత్యాన్ని నిరూపించిన మహానుభావుడు వాల్మీకి మహర్షి, జన్మతః బోయవాడైన గురువు ఉపదేశం ఆయనను తరతరాలుగా లోకమంతా గౌరవించి పూజనీయ స్థానంలో నిలబెట్టింది అని అందుకనే మన సాంప్రదాయాలలో తల్లి, తండ్రి,గురువు,దైవం అన్నారు. సకల మానవాళికి ధర్మాన్ని సంపూర్ణంగా ఆచరించి చూపించి శ్రీరాముని చరిత్రను 24 వేల శ్లోకాలతో శ్రీ రామాయణము గా మనకు అందించిన మహానుభావుడైన వాల్మీకి మహర్షి మన అందరికీ నిత్య పూజనీయుడు, స్మరణీయుడు అట్టి మహానుభావుని జయంతి ఉత్సవాన్ని శ్రీ వాల్మీకి జయంతిగా మంగళవారం ఓదెల గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో పురోహితుని వేదమంత్రోచ్ఛారణల మధ్య ఘనముగా జరుపుకోవడమైనది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా గ్రామం మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ విచ్చేసి వాల్మీకి మహర్షిని కొనియాడారు. కార్యక్రమంలో ఓదెల వాల్మీకి బోయ కుల సంఘం అధ్యక్షులు బోగె సదానందం కుల సంఘం మాజీ అధ్యక్షుడు బోగె శంకర్ బాబు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్త కనికి రెడ్డి సతీష్, కుల సంఘం సభ్యులు మీనుగు రమేష్,బోగే కుమార్,మండల రాజు,బోగె శ్రీనివాస్, బోగె కుమార్, మండల శ్రీను, సోగల నవీన్, కుడుదల సతీష్,మీనుగు రాకేష్ ఓదెల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లోని పి.జి.ఆర్.యస్. హాల్ నందు వాల్మీకి మహర్షి జయంతి




పల్నాడు, అక్టో బర్ 7 : కలెక్టరేట్ లోని పి.జి. ఆర్.యస్. హాల్ నందు వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహిం చటం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా పల్నాడు జిల్లా కల్లెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, శ్రీమతి కృతిక శుక్ల నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డా.చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు కల్లెక్టర్ కృతిక శుక్ల గారు మాట్లాడుతూ వాల్మీకి గారు రచించిన రామాయణం మానవాళికి అనుసరన్నుయమని త్రేతాయుగంలో రచించిన రామాయణం గొప్ప కావ్యమని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి అందరివాడు అని వాల్మీకి జయంతి ఏ ఒక్క వర్గానికి చెందినది కాదని అందరు జరుపుకోవాల్సిన పండుగ అని పేర్కొన్నారు

# ఘనంగా శ్రీ వాల్మీకి మహర్షి జయంతి

పల్నాడు, అక్టోబర్ 7 : పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదికవి ,రామాయణాన్ని అందించిన మహానుభావుడు శ్రీ వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పులమాల లతో నివాళులర్పించిన పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీ బి.కృష్ణారావు ఐపీఎస్ గారు,. ఈ సందర్భంగా శ్రీ ఎస్పీ గారు మాట్లాడుతూ కుటుంబ మరియు మానవతా విలువలు ప్రతిబింబించే విధముగా మహాకావ్యం రామాయణాన్ని రచించి,సమాజానికి అందించిన వాల్మీకి మహాకవి కృషి ఎనలేనిది.

# జస్టిస్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



పెద్దపల్లి (ఆకాంక్ష) : దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్నహౌసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై సనాతన ధర్మం ముసుగులో జరిగిన మనువాద దాడిని పెద్దపల్లి బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఇరికిళ్ల రాజనర్సయ్య తీవ్రంగా ఖండించారు. ఈ దాడి దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజని, భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, లౌకిక ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే పార్టీ భావిస్తుందని అన్నారు. దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ, ఆధిపత్య కులాల నుండి అవమానాలు మాత్రం తప్పడం లేదన్నారు. దేశంలో వేల ఏళ్లుగా అవమానాలకు గురవుతున్న జాతులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారం దక్కాలని ఆకాంక్షించారు. దాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



రామగిరి (ఆకాంక్ష) : పలిమేల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ఇటివలె రోడ్డు ప్రమాదంలో గాయపడగా మహదేవ్ పూర్ మండల కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అడిగి తెలుసుకున్నారు.అలాగే మహదేవ్ పూర్ మండల కేంద్రంలో షాహీన్ %డ% షహీబ్ తల్లి ఇటివల మరణించగ వారి కుటుంబాన్ని పరామర్శించారు.

# అక్టోబర్ 12 నాటికి వీ-హబ్ నిర్మాణం పూర్తి చేయాలి

## - రంగంపల్లి లోని వీ హబ్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



గోదావరిఖని అక్టోబర్ - 07(ఆకాంక్ష) : అక్టోబర్ 12 నాటికి వీ-హబ్ నిర్మాణం పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రంగంపల్లి లోని వీ హబ్ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... పెద్దపల్లి జిల్లాలో మహిళా వ్యాపార అభివృద్ధి, నైపుణ్య అభివృద్ధి, ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు వీ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు త్వరలో ప్రారంభించనున్నామని అన్నారు. వీ-హబ్ పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అక్టోబర్ 12 నాటికి గ్రామీణ అభివృద్ధి శాఖకు అప్పగించాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిఆర్డిఓ ఎం. కాళిందిని,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మోహన్ పటేల్



పెద్దపల్లి (ఆకాంక్ష) : మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ధర్మారం మండలం బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన ఇమ్మిడిశెట్టి మోహన్ పటేల్ ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్ కుమార్, రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ తెలిపారు. హైదరాబాద్ లో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యాలయం మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ అధ్యక్షతన పెద్దపల్లి జిల్లా స్థాయి మున్నూరు కాపు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈమేరకు మోహన్ పటేల్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. కాగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు మోహన్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# సిద్ధాశ్రమంలో 201వ పవిత్ర శక్తి హెూమం

నరసన్నపేట : నరసన్నపేట ఇందిరానగర్ కోలనీ వద్దగల సిద్ధాశ్రమంలో 201వ పవిత్ర శక్తి హెూమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ శక్తి హెూమం అనేది హిందూమతంలో అగ్నిని ఉపయోగించి చేసే ఒక పవిత్ర యాగమని, దీని ద్వారా దేవతా శక్తిని ఆరాధించడం జరుగుతుందని, ఈ హెూమం చేయడం వల్ల ప్రతికూల శక్తుల నుంచి రక్షణ, శత్రువులపై విజయం, శారీరక శుద్ధీకరణ, ఆరోగ్యం, విజయం కలుగుతాయన్నారు. ప్రతికూల శక్తుల నుండి రక్షణ, దుష్ట శక్తుల పీడ, మంత్ర విద్యల ప్రభావాల నుండి విముక్తి లభిస్తుందన్నారు.

# ఆశ సమావేశాలలో కీటక జనిత వ్యాధుల పై అవగాహన కల్పించిన డి. ఎం. ఎచ్.ఓ. డా.వాణి శ్రీ





పెద్దపల్లి (ఆకాంక్ష) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రాగినేడు మరియు గర్రెపల్లి యందు జరిగిన ఆశ సమావేశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ గారు పాల్గొన్నారు.ఈ నెల ఆశ సమావేశ టాపిక్ అయిన కీటక జనిత వ్యాధుల పై అవగాహన కల్పించారు. ప్రతి శుక్ర వారం డ్రై డే పాటించాలని, ఆశలు కనీసం 30 గృహాలు సందర్శించి దోమ లార్వా పెరుగుదల నిలువలను గుర్తించాలి, వాటిని తొలిగించుటకు అవగాహన కల్పించాలి అని అన్నారు.తొలిగించటకు వీలుగాని, వాడని నీటి నిల్వల యందు ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. జ్వరాల సర్వే నిర్వర్తించాలని అన్నారు. గర్భిణీ స్త్రీలను 3 నెలల లోపూ నమోదు చేయాలని, వారికి మొదటి రెండు పరీక్షలు ఆరోగ్య కేంద్రాల యందు మరియు 3,4 వ పరీక్షలు దగ్గరలోని కమ్యూనిటీ ఆసుపత్రి లేదా ప్రసూతి ఆసుపత్రుల యందు చేయించాలి అని, అందుకు రవాణా కొరకు102 వాహనం సేవలు వినియోగించు కోవాలి అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల యందు ప్రసవం లను పెంచాలి అని అన్నారు. ఎన్.సి.డీ స్క్రీనింగ్ నిర్వహించాలి, ప్రతి క్షయ వ్యాధి గ్రస్తులను మందులను సక్రమంగా వాడేవిదంగా చూడాలని అన్నారు. తగ్గని దగ్గు, జ్వరం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్న వారికి తెమడ పరీక్షలు చేయించాలి అని అన్నారు. ఆశలు సేవ దృక్పథం తో ఆరోగ్య సేవలు అందించాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా.ఆర్.రాజమౌళి, డా. బి. శ్రీరాములు, డా. కె. వి. సుధాకర్ రెడ్డి, వైద్యాధికారులు డా.శ్రవణ్ కుమార్, డా. ఉదయ్, ఆశ నోడల్ సూపర్వైజర్ లు, ఎ . ఎన్.ఎం.లు మరియు ఆశలు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాల 90 రోజుల అనుమతి ఇంకా ఎన్నాళ్లు

## -విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.. అధికారుల నిర్లక్ష్యం...!

## కేసులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ కార్పొరేట్ పాఠశాల సొసైటీ వ్యవహారం...




గోదావరిఖని(ఆకాంక్ష) : ఒకవైపు విద్యను సేవగా, మరొకవైపు వ్యాపారంగా మార్చుకొని రామగుండం నియోజకవర్గంలో కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పుడు చట్టాలకూ, నిబంధనలకూ మించి నడుస్తున్నాయి. కేవలం 90 రోజుల తాత్కాలిక అనుమతితో ప్రారంభించిన ఓ కార్పొరేట్ పాఠశాల, గడువు ముగిసినా ఇప్పటికీ నిరభ్యంతరంగా నడుస్తున్న సంబంధించిన కార్పొరేట్ పాఠశాలపై ఆయా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఎన్నో అనుమానాలు తలుకుతున్నాయి. ఈ పాఠశాల సొసైటీ వ్యవహారం ప్రస్తుతం పోలీస్ స్టేషన్ వరకు చేరినప్పటికీ, విద్యాశాఖ అధికారులు మాత్రం మూగవైఖరి అవలంబిస్తున్నారు.సొసైటీ నాది అంటే నాదే అని కొందరు వ్యక్తులు గొడవలకు దిగిపోవడంతో, సొసైటీ అంతర్గత వివాదం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. విద్యాసంస్థలు విద్యను పంచే ఆలయాలుగా ఉండవలసిన చోట, న్యాయపరమైన వివాదాలు, పోలీస్ కేసులు చోటు చేసుకోవడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలకు సంబంధించిన బిల్డింగ్, మున్సిపల్, ఫైర్, ట్రాఫిక్, ఎన్ఓసీ పర్మిషన్‌లు సరైనవిగా ఉన్నాయా అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇప్పటి వరకు ఎవరూ ఇవ్వలేదు. ఈ అనుమతులన్నీ పూర్తయ్యాకే విద్యాసంస్థలు నడవాలన్న ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ, ఇక్కడ అవి పూర్తిగా విస్మరించబడ్డాయి. కార్పొరేట్ పేరుతో అడ్డగోలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక దోపిడీ కొనసాగుతోంది. అయితే ప్రస్తుత పరిస్థితులలో భవిష్యత్తులో విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగానికి, గ్రూప్ పరీక్షలకు దరఖాస్తు చేసుకుని ఉద్యోగం సాధించిన సమయంలో సదురు కార్పొరేట్ పాఠశాల వివిధ రకాల సొసైటీ పేరుతో ఇచ్చిన సర్టిఫికెట్లు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నేట్టే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వ ఉద్యోగానికి మొదటి నుంచి చివరి వరకు ప్రతి పాఠశాల సర్టిఫికెట్ ను క్షుణ్ణంగా పరిశీలించే ఈ పరిస్థితులలో వివిధ రకాల పేరుతో ఇచ్చే సర్టిఫికెట్లు విద్యార్థుల భవిష్యత్తును ఏ దిశగా తీసుకెళ్తాయి అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.ఇక పాఠశాల నడుస్తున్న చట్టబద్ధతపై తీవ్ర ప్రశ్నలు నెలకొన్నాయి. కేవలం 90 రోజుల అనుమతితో పాఠశాల నడపడం అంటే చట్టాన్ని తేలిగ్గా తీసుకోవడమే అని విద్యావేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. పాఠశాల యాజమాన్యంలోని సొసైటీ సభ్యుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడిపోయారు.ఈ సంస్థపై కేసులు నడుస్తున్న నేపథ్యంలో, ఇక్కడ చదివిన విద్యార్థులు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసినప్పుడు వారి విద్యాప్రమాణాలు చెల్లుతాయా లేదా?” అనే ఆందోళన తల్లిదండ్రుల్లో పెరుగుతోంది. విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి కార్పొరేట్ వ్యవస్థలు లాభాల కోసం ఆడుతున్న ఆటను నిరోధించాల్సిన బాధ్యత విద్యాశాఖపైనే ఉందని విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు.ఇదే సమయంలో ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారుల మౌనం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఏమైనా ఈ పాఠశాల యాజమాన్యానికి అధికారులతో ప్రత్యేక సంబంధాలున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో చక్కర్లు కొడుతున్నాయి.ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలో ఉండగా, తల్లిదండ్రులు మాత్రం విద్యార్థుల భవిష్యత్తు చీకటిలో పడకూడదని కోరుతున్నారు. విద్యాశాఖ తక్షణ చర్యలు తీసుకుని చట్టపరమైన ప్రమాణాలు పాటించని కార్పొరేట్ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.విద్యను వ్యాపారంగా మార్చిన ఈ తరహా కార్పొరేట్ పాఠశాలపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించకపోతే, రేపటి తరానికి చీకటి భవిష్యత్తు తప్పదని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడే పాఠశాలలు మూసివేయాలని 90 రోజుల పర్మిషన్‌తో నడిచే పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడం అంటే విద్యాశాఖ నిష్క్రియతకు నిదర్శనం స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# దేశం,రాష్ట్ర అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్,ఐ. ఏ.ఎస్

బాపట్ల, అక్టోబర్ 7 : సమాజంలో జరుగుతున్న మంచి విషయాలను విద్యార్థులు తెలుసుకోవాలి, నేర్చుకోవాలి అవగాహన చేసుకొని వాటిని ప్రజలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం యద్దపూడి మండలం, అనంత వరం గ్రామం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అములు చేస్తున్న సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై పాఠశాల విద్యార్థు లుకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మంచి విషయాలు పిల్లలుతెలుసుకోవాలి,నేర్చుకోవాలి అవగాహన చేసుకొని వాటిని ప్రజలకు తెలియజేస్తారన్న ఉద్దేశంతో ఈరోజు మీ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులకు చూచించారు.దేశం రాష్ట్రం అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. గతంలో దేశంలోను రాష్ట్రంలోను వివిధ రకాలుగా పన్నులు ఉండేదని,2017 కేంద్ర ప్రభుత్వం జిఎస్టీ ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. ప్రస్తుతం 0.5.12.శాతానికి తగ్గించిందని తెలిపారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అములు చేస్తున్న 2.%వా% సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై పిల్లలు అవగాహన చేసుకొని మీఇంటి లో మీ చుట్టుపక్కల వారికి సూపర్ జిఎస్టీ,సూపర్ సేవింగ్స్ పై అవగాహన కల్పించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు అందరు బాగా చదువుకొని మీ తల్లిదండ్రులకు, మీ పాఠశాల కు జిల్లా కు రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు చూచించారు.

# తెలంగాణ మంత్రుల మధ్య రచ్చకెక్కిన విభేదాలు



హైదరాబాద్,అక్టోబర్ 07(ఆకాంక్ష న్యూస్): పొన్నం ప్రభాకర్, వివేక్ లపై అడ్లూరి లక్ష్మణ్ ఫైర్. మంత్రి పొన్నం ప్రభాకర్ దున్నపోతు అంటూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఫైర్ పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడడం నాకు రాదు. పొన్నం మారకపోతే జరిగే పరిణామాలు ఆయనే బాధ్యత వహించాలి. వివేక్ లాగా నా వద్ద డబ్బులు లేవు. నేను మంత్రి కావడం, మా సామాజిక వర్గంలో పుట్టడం నా తప్పా?.. త్వరలో సోనియా, రాహుల్, ఖర్గే, మీనాక్షిని కలుస్తా. నేను కుర్చీలో కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నాడు. నేను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదు-అడ్లూరి లక్ష్మణ్.

# వానాకాలం ధాన్యం కొనుగోళ్ళకు 309 కేంద్రాలు



జనగామ టౌన్: అక్టోబర్: 07(ఆకాంక్ష న్యూస్) : ఖరీఫ్(వానాకాలం)ధాన్యం కొనుగోళ్ల కోసం జనగామ జిల్లాలో మొత్తం 309కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషవెల్లడించారు.వీటిలో185ఐకెపి కేంద్రాలు,124ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలకు సంబంధించిన కేంద్రాలు ఉన్నాయి.మొత్తం 2,05,057 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడుతుందని ఆయన తెలిపారు.

# రోజురోజుకు పెరుగుతున్న దేవాలయాలలో దొంగ తనాలు



వరంగల్:వర్ధన్నపేట మండలం: అక్టోబర్ 07(ఆకాంక్ష న్యూస్): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని కోనారెడ్డి చెరువు వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. మొన్న ఇల్లంద రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈరోజు దుర్గమ్మ ఆలయం ఇంకా రేపు మరొక ఆలయం ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకోవాలని పోలీసులను కోరుకుంటున్న పట్టణ ప్రజలు.

# కాజీపేటలో ఓటు చోరీ ర్యాలీలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హన్మకొండ,కాజీపేట,అక్టోబర్ 07(ఆకాంక్ష న్యూస్):గత ఎన్నికల్లో జరిగిన ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు చోరీ ర్యాలీలో స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలను బీజేపీ నాశనం చేస్తోందని అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడి పవిత్ర హక్కు అని, ఆ హక్కును చోరీ చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. బీజేపీ ఓటు దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కి విజ్ఞప్తి చేస్తాం అని ఎంపీ తెలిపారు. ర్యాలీ అనంతరం ఓటు చోరీకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి తమ సంతకాల ద్వారా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు, యువత, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిషేధిత మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి వరంగల్ సీపీ ఎదుట లొంగుబాటు




వరంగల్, అక్టోబర్ 07 (ఆకాంక్ష న్యూస్): నిషేధిత సి.పి.ఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్, డివిజనల్ కమిటీ సభ్యుడు, దండకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కి చెందిన మంద రూబెన్ ఏకన్నన్న ఏమంగన్న ఏసురేష్(67) వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట మంగళవారం లొంగిపోయాడు. ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడిస్తూ హన్మకొండ జిల్లా, హసన్ పర్తి మండలం, వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్,ఏకన్నన్న ఏమంగన్న ఏసురేష్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్.ఈ.సిలో హాస్టల్ మెస్ విభాగంలో పనిచేస్తున్న సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీమాజీ ప్రధాన కార్యదర్శి ఒక్కప్పటి ఆర్.ఈ.సి పూర్వ విద్యార్థి నంబాల కేశవరావు పిలుపు నందుకొని మావోయిస్టు పార్టీ లో చేరి అజ్ఞతంలోని వెళ్లిపోయాడు. 1981 సంవత్సరం నుండి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వం దళ సభ్యుడుగా కుంట, బస్తర్ ప్రాంతాల్లో పనిచేసాడు. 1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ ను ఏరియా కమిటీ సభ్యుడిగా అప్పగించడం జరిగింది. 1991లో అనారోగ్యం కారణంగా చికిత్స కోసం కొత్తగూడెం కు వెళుతున్న సమయంలో చత్తీస్గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలు తరలించగా ఒక సంవత్సరం అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి జైలు నుండి తప్పించుకున్నాడు. 1992 లో జైలు తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీ లో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ ఏరామన్న గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమే తో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడి పనిచేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం వుంటూ, కోళ్లు, గొర్రెలు ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులను కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందిస్తూ మావోయిస్టుల కోసం పని చేసేవాడు. అనారోగ్యం బాధపడుతున్న రూబెన్, ఉద్యమంలో పాల్గోడంలో శరీరం సహకరించకపోవడం ముఖ్యంగా మావోయిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని, నిర్ణయించుకొని పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోవడం జరిగిందని సీపీ తెలియజేశారు.

**రూబెన్ పాల్పడిన నేరాల వివరాలు**

– కుంట దళ సభ్యుడిగా పనిచేసే సమయంలో పెద్ద కెడు వాల్, పండోడు, పిడిమాల్, బండారిపాడు గ్రామాలకు చెందిన గ్రామస్తులను దళ సభ్యులతో కలసి హత్యలు చేయడంతో పాటు ఎలమకొండా గ్రామ సర్పంచ్ ను హత్య చేసిన సంఘటనల్లో నిందితుడు.

– 1988లో గొల్లపల్లి-మారాయి గూడ మార్గం లో పోలీసుల కాన్వాయి పై మావోయిస్టుల కలసి 20 మంది సి.ఆర్.పి.ఎఫ్ పోలీసులను దారుణంగా హత్య చేసి వారి ఆయుధాలను పట్టుకొని పోయిన సంఘటనలో నిందితుడు.

– 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడు గోపన్నతో కలసి తుర్లపాడు పోలీస్ స్టేషన్ పై దాడి చేసిన ఘటన లో రూబెన్ నిందితుడు. రూబెన్ పై 8లక్షల రూపాయల రివార్డ్ వుందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

# పోలియోతో మంచానికే పరిమితం అయినా బాలుడుకి 5000 రూపాయల ఆర్థిక సహాయం



హైదరాబాద్, అక్టోబర్ 07(ఆకాంక్ష న్యూస్): జీడిమెట్ల కుత్బుల్లాపూర్ కు చెందిన మల్లే శ్రీకాంత్ 3 నెలల చిన్న వయస్సులో పోలియో బారిన పడడం వలన కాళ్ళు, చేతులు పని చెయ్యక మంచానికి పరిమితం అయ్యాడు. వీరిది నిరుపేద కుటుంబం, సొంత ఇల్లు కుడా లేదు, వీరి తల్లి కొన్ని ఇళ్ళలో పనిచేస్తుంది. ప్రస్తుతం ఆ పని కూడా దొరకడం లేదు. అతని తండ్రి కాలికి దెబ్బ తగలడం వలన ఇంట్లోనే ఉంటున్నాడు. ప్రస్తుతం రాజీవ్ గృహ కల్పలో 2000 రూపాయలు ఇచ్చి అద్దెక్కుంటున్నారు. ఇతనికి వచ్చే వికలాంగుల పెన్షన్ నుండి ఆ కిరాయి చెల్లిస్తూ రోజులు గడుపుతున్నారు. ప్రస్తుతం ఇతని కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉంది. తినడానికి తిండి కూడా దొరకడం లేదు. కనీసం బియ్యం కొందాం అన్నా డబ్బులు లేవు. దయచేసి దాతలు ముందుకు వచ్చి సహాయం చేయగలరని వేడుకోగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ కీలక సభ్యుడు , గజ్జెల సుమన్ దాతల ద్వారా డబ్బులు సేకరించి ఈరోజు అతని ఇంటికి వెళ్లి పరామర్శించి వల్లెపు దేవేందర్ ద్వారా 5000 రూపాయలు మల్లే శ్రీకాంత్ కు అందజేయడం జరిగింది. మరి కొంతమంది దాతలు అతనికి డబ్బులు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో మార్త శ్రీనివాస్, ఆకుల నరేష్, రాందేవ్ అగర్వాల్, మంద శ్రీధర్, వంగరి చరిత విశ్వతేజ, అరవింద్ కుమార్, మునిగాల రాకేష్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు , బొట్టు కమలాకర్, కోల రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , ఊరటి రవికుమార్ గార్లు పాల్గొనడం జరిగింది.





# స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహ సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు

వరంగల్,అక్టోబర్ 07(ఆకాంక్ష న్యూస్): నేడు హంటర్ రోడ్ లోని సత్యం కన్వెన్షన్ నందు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహ సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ రావు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అవలంబిస్తున్న సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో ఉన్నటువంటి నాయకులు అందరూ కలిసి పథకాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేయాలి, భారతీయ జనతా పార్టీ గెలుపుకై అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, జిల్లా ఎన్నికల కన్వీనర్ & మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, డాక్టర్ టి రాజేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, చైర్మన్ జక్కు రమేష్, వనం రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ జెడ్పిటిసి సునీత మరియు స్థానిక సంస్థ ఎన్నికల మండల ప్రభారీలు, కన్వీనర్లు, మండల అధ్యక్షులు, మరియు జిల్లా మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నూతన సీఐ ని కలిసిన బిజెపి నాయకులు

సంగెం మండలం, అక్టోబరు 07(ఆకాంక్ష న్యూస్): గీసుగొండ మండలం, గ్రేటర్ వరంగల్ 15 వ డివిజన్ బిజెపి అధ్యక్షులు ల్యాదల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా గీసుగొండ మండలానికి సి ఐ గా భాధ్యతలు చేపట్టిన విశ్వేశ్వర్. ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్,ఓ బి సి మోర్చా జిల్లా కార్యదర్శి ఆడేపు రమేష్,జిల్లా కౌన్సిల్ మెంబర్ బిల్లా రమేష్,సొసైటీ డైరెక్టర్ లెంకలపెల్లి స్వామి, డివిజన్ ప్రధాన కార్య దర్శులు రాదారపు మల్లిఖార్జున్,గుండెబోయిన రంజిత్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు బందెల రేణుక, డివిజన్ నాయకులు రామన్న, కందుల రవికిరణ్ గబ్బెట శ్రీనివాస్,బండారి సదానందం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్

జనగామ టౌన్:అక్టోబర్07(ఆకాంక్ష న్యూస్): 1. జనగాం జిల్లాలోని 50 రిటైల్ లిక్కర్ ఎ4 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయబడింది. 2. లైసెన్స్ వ్యవధి: 1-12-2025 నుండి 30-11-2027 వరకు. 3. 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ఎవరైనా తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుముగా రూ. 3 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. 4. దరఖాస్తులు దాఖలు చేయడానికి చివరి తేదీ: 18-10-2025. 5.దరఖాస్తులను జనగాం కార్యాలయం, ఇరిగేషన్ క్వార్టర్స్, వడ్లకొండ రోడ్, జనగాం వద్ద దాఖలు చేయవచ్చు. 6. రాష్ట్రంలోని ఏదైనా దుకాణానికి దరఖాస్తును. కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, తెలంగాణ, హైదరాబాద్ వద్ద దాఖలు చేయవచ్చు.

# ఓటు చోరు – గద్దె చోడ్

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఓట్ల చోరీకి పాల్పడుతున్న బిజెపి సహకరిస్తున్న ఎలక్షన్ కమిషన్
- దేశ ఎన్నికల సంఘం, బీజేపీ కనుసన్నల్లో నడుస్తూ, దొంగ ఓట్లు సృష్టించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోంది
- ఓటు వ్యవస్థను ధ్వంసం చేస్తూ, అధికారం కోసం బీజేపీ చేస్తున్న తంతును బహిర్గతం చేయడం మా బాధ్యత
- ఓటును చోరీ చేసి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసిన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమానికి నిర్వహించిన ఎమ్మెల్యే నాగరాజు ఎంపీ కావ్య







వరంగల్ జిల్లా/వర్ధన్నపేట,అక్టోబర్ 07(ఆకాంక్ష న్యూస్): ఓటు చోరీకి పాల్పడిన బీజేపీ ప్రభుత్వం,బీజేపీ కనుసన్నల్లో నడుస్తున్న ఈసీ తీరుపై రాహుల్ గాంధీ గారు దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ రోజు ఓటు చోరీ పై సంతకాల సేకరణ కార్యక్రమం వర్ధన్నపేట టౌన్ అంబేద్కర్ సెంటర్ చౌరస్తాలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య గారు పాల్గొన్నారు.... అనంతరం ఓటు చోరీకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాగరాజు గారు, ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి తమ సంతకాల ద్వారా నిరసన వ్యక్తం చేశారు..... ఓటు చోరీ పై బూత్ స్థాయి, మండల,డివిజన్, గ్రామ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు,ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి సంతకాలని సేకరించాలని పిలుపునిచ్చారు.... అనంతరం ఎమ్మెల్యే నాగరాజు గారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ, ఓటు హక్కును నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని దేశవ్యాప్తంగా ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. దేశ ఎన్నికల సంఘం, బీజేపీ కనుసన్నల్లో నడుస్తూ, దొంగ ఓట్లు సృష్టించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని ఆరోపిస్తూ, పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ గారు "ప్రజలు క్షేత్రస్థాయి నుంచి దేశస్థాయి వరకు జాగ్రత్తగా ఉండాలి" అని పిలుపునిచ్చారు అన్నారు. భారత రాజ్యాంగంలో కీలకమైన ఓటు వ్యవస్థను ధ్వంసం చేస్తూ, అధికారం కోసం బీజేపీ చేస్తున్న తంతును బహిర్గతం చేయడం మా బాధ్యత. ఈ విషయాన్ని గ్రామం నుంచి దేశ స్థాయికి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కలిగించాలి ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలను బీజేపీ నాశనం చేస్తోందని అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడి పవిత్ర హక్కు అని, ఆ హక్కును చోరీ చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. బీజేపీ ఓటు దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కి విజ్ఞప్తి చేస్తాం అని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల డివిజన్ గ్రామ స్థాయి స్థానిక కాంగ్రెస్ నేతలు, యూత్ కాంగ్రెస్, మహిళా కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది

-జెరిపోతుల మల్లయ్య. బిఎస్పీ జిల్లా ఇంచార్జ్,మడిపడిగ చంద్రశేఖర్.బిఎస్పీ జిల్లా అధ్యక్షులు



జనగాం, అక్టోబర్ 7 (ఆకాంక్ష న్యూస్) : బహుజన సమాజ్ పార్టీ జనగామ జిల్లా ఈసి మెంబర్ తాండ్ర లావణ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా బిఎస్పీ జిల్లా ఇంచార్జ్ జెరిపోతుల మల్లయ్య పాల్గొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (%జజీ×%) జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై న్యాయవాది రాకేశ్ కిశోర్ దాడి చేయడాన్ని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని,ఈ దాడిని న్యాయవ్యవస్థపై,రాజ్యాంగంపై జరిగిన దాడిగా,న్యాయస్థానం పవిత్రతను,గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నవే ఈ దాడి అన్నారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ప్రవర్తించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై కఠినమైన చర్యలు తీసుకోని, ఉరిశిక్ష విధించాలని బీఎస్పీ డిమాండ్ చేస్తోందని అన్నారు.భారత రాజ్యాంగానికి,ప్రజాస్వామ్య వ్యవస్థకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (%జజీ×%) రక్షకులని,వారిపై జరిగిన దాడిని యావత్ దేశం ఖండించాలని ఆయన పేర్కొన్నారు.దాడి చేసిన న్యాయవాది 'సనాతన్ కా అప్‌మాన్ నహీ సహేంగే' (సనాతన ధర్మాన్ని అవమానించడాన్ని సహించబోము) అని నినాదాలు చేయడంపై బీఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

మత భావాలను రాజకీయం చేస్తూ, హింసకు ప్రేరేపించడం సనాతన ధర్మానికే కళంకం.ఇటువంటి దుర్మార్గపు చర్యలను తీవ్రంగా నిరసించాలని ఆయన పిలుపునిచ్చారు.లౌకిక,సమతా,సౌభ్రాతృత్వ విలువలతో కూడిన భారత ప్రజాస్వామ్యాన్ని కూల్చివేయాలని చూస్తున్న మతోన్మాద శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,వారిని సమాజం నుంచి పూర్తిగా తరిమికొట్టేందుకు బహుజన సమాజ్ పార్టీ కృషి చేస్తుందని స్పష్టం చేశారు.?ఈ దాడిని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని, రాజ్యాంగం కల్పించిన లౌకిక విలువలను కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు చిలుముల అర్జున్, తాండ్ర సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్లకు ప్రభుత్వం వెంటనే వేస్తారు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావు డిమాండ్

ఎచ్చర్ల, (ఆకాంక్ష న్యూస్) : ఆశా వర్కర్స్ కు ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు టి.త్రినాధరావు డిమాండ్ చేసారు. ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జి.సిగడాం, బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు గత 6సంవత్సరాలు నుండి వేతనాలు పెంచలేదని, పని భారం పెరిగిందని విమర్శించారు. పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్ ని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఎన్..హెచ్.ఎం స్కీం ఏర్పడి 20 సం.ఎలు అయినప్పటికీ కనీస వేతనాలు చెల్లించడంలేదని అన్నారు. ఆశాలకు జాతీయ, పండుగ సెలవులు, వారాంతపు సెలవులు, మెడికల్ అన్ని రకాల సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. 5జి మొబైల్స్ ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. పి.హెచ్.సి కి వెళ్ళిన ప్రతి సందర్భంలో టిఎ,డిఎ లు ఇవ్వాలని, ఏఎన్ఎం, జిఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆశాలతో సబ్ సెంటర్స్ క్లీనింగ్ చేయించడం, వ్యాక్సిన్ క్యారియర్స్ మోయించడం, రికార్డ్స్ మరియు అదనపు పనులు చేయించరాదని కోరారు. ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు సబ్ సెంటర్లో ఉండాలని ఒత్తిడి చేయడం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ధర్నా అనంతరం సిహెచ్ఓ సత్యంనాయుడు గారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెలమల. రమణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, మౌళి,రాజు, రాధ, ఉషా, రాము తదితరులు పాల్గొన్నారు.

## యువపరివర్తన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

వరంగల్/వర్ధన్నపేట మండలం అక్టోబర్ 07(ఆకాంక్ష న్యూస్): వర్ధన్నపేట పట్టణం కేంద్రం లో మెగా జాబ్ మేళాను – సద్వినియోగం చేసుకోవాలని పిలుపు... ?నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 10/10/25 శుక్రవారం రోజు ఉదయం 9.30 నుండి మెగా జాబ్ మేళా వర్ధన్నపేట లో నిర్వహించనున్నారు. వర్ధన్నపేట లోని కె.ఎస్.డబ్ల్యు.ఏ యువ పరివర్తన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా మేనేజర్ నరేష్ కెంచ గారు యువపరివర్తన్ బెల్లంకొండ వెంకట్ గారు వర్ధన్నపేట మేనేజర్ రంజిత్ గారు తెలిపారు.

**ముఖ్యాంశాలు:** పాల్గొనే కంపెనీలు: సుమారు 34 ప్రముఖ జాతీయ, రాష్ట్ర స్థాయి కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి...

**ఉద్యోగ అవకాశాలు:** సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, మార్కెటింగ్, హెల్త్‌కేర్, టెక్నీషియన్, టైలరింగ్,బ్యూటిషన్,మెకనిక్,తదితర రంగాలలో దాదాపు 300 కు పైగా ఖాళీలను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు...

**అర్హతలు:** ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు వారి విద్యార్హతలను బట్టి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు...

**రిజిస్ట్రేషన్ వివరాలు:**

అభ్యర్థులు తమ బయోడేటా (5 కాపీలు), విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు మరియు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నేరుగా మేళాకు హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో ఈ జాబ్ మేళా ముఖ్య పాత్ర పోషిస్తుందని, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వర్ధన్నపేట బస్టాండ్ నుండి పుస్కోస్ స్కూల్ వెళ్ళే దారిలో అన్నదాత ఆగ్రోస్ పక్కన...8328655542, 9676843762.

## ప్రాథమిక పాఠశాలకు 6 వేల విలువ గల వస్తువుల బహుకరణ



జనగామ జిల్లా/ పాలకుర్తి అక్టోబర్ ,7 (ఆకాంక్ష న్యూస్) : పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు హనుమకొండ వాస్తవ్యులు కీ"శే" మంద రఘుపతి జ్ఞాపకార్థం వారి అల్లుడు కమటం శ్రీనివాస్–శ్రీలత గార్లు విద్యార్థుల కొరకు రూ 6వేల విలువ గల మార్చ్ ఫాస్ట్ డ్రం, స్మాల్ డ్రం, కంజర, గజ్జెలు, 20 లెజిమ్స్ మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిదురాల శ్రీనివాస్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ కుమార్, ఎం శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్, శ్రీలత, మంజుల పాల్గొన్నారు. వారికి పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీలత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



జనగాం, రఘునాథపల్లి, అక్టోబర్ 7 (ఆకాంక్ష న్యూస్): రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ అధ్యక్షత స్టేషన్ ఘన పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నచ్చి శివాజీ నగర్ మల్లంపల్లి గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోనికి ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా మారుజోడు రాంబాబు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి వచ్చిన మాజీ సర్పంచ్ డాక్టర్ రాజయ్య మాయమాటలు చెప్పి పార్టీ టికెట్ ఇస్తామని బిఆర్ఎస్ లోకి మళ్లీ తీసుకోవడం జరిగింది ఆయన ఒక్కరు కాంగ్రెస్ పార్టీని వీడితే ఆయన మీద విరక్తితో ఆ గ్రామాలనుండి 30 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పూచ్చుకోవడం జరిగిందని తెలిపారు. డాక్టర్ రాజయ్య మండలంలో ఏ పర్యటన చేసిన గ్రామాలలో ఏ ఒక్కరు కూడా స్వాగతం పలకడం లేదని చిల్లర మాటలు మాట్లాడుతున్నారని,మరలా ఇలాంటి చిల్లర చేష్టలు చేస్తే మండలంలో బిఆర్ఎస్ పార్టీ లేకుండా చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రాజయ్య ఏ పర్యటన చేసిన గ్రామాలలో అభివృద్ధి లేదని పాత చింతకాయ పచ్చడి లాగా ప్రగల్బాలు పడుతున్నారని అదేవిధంగా కడియం శ్రీహరి గ్రామ గ్రామానా చేసినటువంటి అభివృద్ధి మేము చూపెట్టడానికి వస్తాము మీరు ఏ గ్రామం ఎంచుకుంటారో చెప్పండి అనిమీరు ఉప ఎన్నిక వస్తుందని గాల్లో మెడలు కడుతున్నారు కానీ నీకు టికెట్ కూడా రాదని హెచ్చరించారు ఈ విధంగా మరొక్కసారి మాట్లాడితే ఎర్రగడ్డ హస్పటల్ కు పంపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నామాల బుచ్చయ్య,పోకల శివకుమార్ మార్కెట్ డైరెక్టర్ భాష్మియా, బంధ కుమార్,గాద మహేందర్ రెడ్డి,తాటికొండ వెంకటేష్ యాదవ్ యువజన నాయకులు లోనే శ్రావణ్ కుమార్, కడారి రవి గడ్డమీది కిరణ్ గౌడ్, వడ్లకొండ శివప్రసాద్ బొమ్మనభరత్, రొయ్యల భాస్కర్, కాంగ్రెస్ పార్టీలో చేరిన మల్లంపల్లి మాజీ ఉపసర్పంచ్ తాళ్లపల్లి కృష్ణ కాంత్ మాజీ వార్డ్ మెంబర్లు తాళ్లపల్లి ప్రభాకర్ గంగాధర్ సలీమ్. గుర్రం బాబు తాళ్లపల్లి ప్రశాంత్ దిలీప్ సుమన్ కోటయ్య జయకర్ అరుణ్ వెంకటేష్ ప్రమోద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## మహిళలకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఏ వయస్సులో ఎక్కువ ఉంటుందో తెలుసా?





ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా చాలామంది గుండెపోటుతో మరణిస్తున్నారు. కొంతమంది అయితే మొదటిసారి గుండెపోటు రావడంతోనే చనిపోతున్నారు. ధమనుల్లో కొవ్వు పేరుకుపోయి గుండెకు రక్తప్రవాహం తగ్గిపోయి గుండెపోటు వస్తుంది. అయితే ఈ పరిస్థితిని పూర్తిగా నయం చేయలేకపోయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యల ద్వారా నియంత్రించవచ్చు. అయితే గుండెపోటు గురించి తాజాగా ఓ షాకింగ్ విషయం బయటికొచ్చింది. మెనోపాజ్ తర్వాత మహిళలకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందట. సాధారణంగా లైఫ్ స్టైల్ లో మార్పులు, స్మోకింగ్, ఆహారం విషయంలో అశ్రద్ద వంటి కారణాలు గుండె పోటు ముప్పుని పెంచుతాయని మనందరికీ తెలిసిందే. అయితే ఈ ప్రమాద కారకాలు మగవాళ్ల కంటే ఆడవాళ్ల గుండె ఆరోగ్యంపైనే మరింత తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఓ అధ్యయనంలో తేలింది. చికాగోలో జరిగిన అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ వార్షిక సమావేశంలో బయటపెట్టిన కొత్త పరిశోధనలు షాకింగ్ ఫలితాలను బయటపెట్టాయి. దాదాపు 11 ఏళ్ల పాటు.. 1 లక్షా 75వేల మంది పెద్దలపై పరిశోధకులు అధ్యయనం చేశారు..ఇందులో 60శాతం మంది మహిళలే ఉన్నారు. అధ్యయనం ప్రారంభం అయ్యే సమయానికి ఎవ్వరికీ ఏ విధమైన గుండె జబ్బులు లేవు. పరిశోధకులు వారి బాడీ మాస్ ఇండెక్స్ (%దీవీ×%), రక్తపోటు, స్మోకింగ్ అలవాటు, ఫుడ్, శారీరక శ్రమ, నిద్ర, రక్తంలో గ్లూకోజ్, కొలెస్ట్రాల్ స్థాయిలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. పురుషులతో పోలిస్తే మహిళలు సరైన స్థాయిలో ఆహారం తీసుకునే విషయంలోనూ, రక్తంలో గ్లూకోజ్, కొలెస్ట్రాల్, రక్తపోటు అదుపులో ఉంచుకునే విషయంలోనూ ముందున్నారు. కానీ శారీరక శ్రమ చేసే విషయంలో మాత్రం కొంచెం వెనుకబడ్డారు. అంటే మహిళలు కొన్ని గుండె సంబంధిత ప్రమాద కారకాలను నియంత్రణలో ఉంచుకున్నప్పటికీ, తగినంత వ్యాయామం చేయకపోవడం వారిని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. మంచి ఆరోగ్య కొలమానాలు ఉన్నప్పటికీ ఎక్కువ ప్రమాద కారకాలు ఉన్న మహిళలు, అలాంటి ప్రమాద కారకాలే ఉన్న పురుషులతో పోలిస్తే గుండె సంబంధిత తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం గణనీయంగా ఎక్కువగా ఎదుర్కొంటున్నారని తేలింది. డయాబెటిస్, రక్తపోటు వంటి కొన్ని ప్రమాద కారకాల వల్ల మహిళలు పురుషుల కంటే ఎక్కువ ప్రతికూల ప్రభావాలు ఎదుర్కొనే అవకాశం ఉంది. దీనివల్ల వారిలో మరణాల రేటు పెరగడానికి, గుండె ఆరోగ్యం క్షీణించడానికి దారితీస్తుంది. అంతేకాకుండా రుతువిరతి అంటే పీరియడ్స్ ముగిసే సమయంలో, గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలు, మానసిక ఒత్తిళ్లు కూడా మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. రుతువిరతి తర్వాత అంటే సుమారు 55 సంవత్సరాల వయస్సులో మహిళలకు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉంటుందని చికాగో హార్ట్ అండ్ వాస్కులర్ స్పెషలిస్ట్‌లలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రోహిత్ అన్నారు.

## మొరాకో స్పెషల్ చికెన్ టాగిన్..





చికెన్ తో అనేక రకాలు వెరైటీలు తయారుచేయవచ్చు. మనదేశంలో అయితే కొన్ని వెరైటీలు చాలా పాపులర్. అదేవిధంగా అనేక పాత వంటకాలకు చాలా ప్రిసిద్ధి చెందిన మొరాకో దేశంలో చికెన్ తో చేసే ఓ రెసిపి ఒక్కసారి తింటే జన్మలో మర్చిపోలేని విధంగా ఉంటుంది. అక్కడివాళ్లు ఈ వంటకాన్ని చికెన్ టాగిన్ అని పిలుస్తుంటారు. నిమ్మకాయలు, ఆలివ్ లను ఉపయోగించి తయారుచేసే మొరాకో స్పెషల్ చికెన్ టాగిన్ ను మీ ఇంట్లోనే ఈజీగా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

చికెన్ టాగిన్ తయారీకి కావలసిన పదార్థాలు -చికెన్ ముక్కలు -కుంకుమ పువ్వు -వెల్లుల్లి -అల్లం పొడి -జీలకర్ర పొడి -నిమ్మ కాయ -కొత్తిమీర -పార్స్లీ ఆకులు -కారం -ఉప్పు -పసుపు -ఉల్లిపాయ -ఆలివ్స్ -ఆయిల్.

చికెన్ టాగిన్ తయారీ విధానం

-ముందుగా ఓ కప్పులో కొద్దిగా కుంకుమ పువ్వు వేసి అందులో వేడి నీళ్లు పోసి 10 నిమిషాలు నానబెట్టాలి. -తర్వాత రెండు నిమ్మకాయలను ముక్కలుగా కట్ చేసి అందులోని పల్ప్ ని తీసి దానిని సన్నగా తరగి పక్కన పెట్టుకోండి. నిమ్మ తొక్కను కూడా పక్కన పెట్టుకోండి. -తర్వాత పార్స్లీ ఆకులను(కొత్తిమీరలాగే ఉండే మరో రకం ఆకు),కొత్తిమీర ఆకులను సన్నగా తరిగి పెట్టుకోవాలి. -తర్వాత పొట్టు తీసిన వెల్లుల్లిని సన్నగా తరుగుకోవాలి. -తర్వాత ఓ పెద్ద బౌల్ లో తరిగిన పార్స్లీ, కొత్తిమీర, వెల్లుల్లి తరుగు, నిమ్మ తరుగు, జీలకర్ర పొడి, అల్లం పొడి , కారం, నానబెట్టిన కుంకుమపువ్వు నీరు, ఆలివ్ ఆయిల్ కొద్దిగా వేసి మొత్తం బాగా కలపాలి.

-ఆ బౌల్ లోనే శుభ్రంగా కడిగి చికెన్ తొడ ముక్కలను (కావాలనుకుంటే ఇతర కోడి భాగాల ముక్కలు వేసుకోవచ్చు)వేసి మసాలాలన్నీ బాగా పట్టించి పైన మూతపెట్టి 1 గంటసేపు లేదా రాత్రంతా ఫ్రిడ్జ్ లో పెట్టుకోండి. -తర్వాత రెండు ఉల్లిపాయలను సన్నగా తరుగుకోవాలి. -తర్వాత ఓ బౌల్ లో కొద్దిగా ఆలివ్ ఆయిల్ పోసి అందులో ఉల్లిపాయ తరుగు వేయాలి. దీని మీద కొద్దిగా ఉప్పు, పసుపు చల్లి దీనిమీద కొన్ని మసాలాలు పట్టించిన చికెన్ ముక్కలు వేసి మూతపెట్టి 1 గంట సేపు పక్కనపెట్టుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బౌల్ లో ఉంచిన ఉల్లిపాయలు, చికెన్ ముక్కలను ఓ గిన్నెలో వేసి 15-20 నిమిషాలు మీడియం మంట మీద ఉడికించుకోవాలి. -చికెన్ ముక్కలలో నుంచి నీరు వచ్చేదాకా ఉడికించిన తర్వాత మంటను తగ్గించి ముక్కలు ఉడికేదా ఉడికించాలి. -తర్వాత అందులో నిమ్మరసం కొద్దిగా, ఆలివ్స్, ముందుగా పక్కనపెట్టుకున్న నిమ్మ తొక్కలు చికెన్ ముక్కలపై పెట్టాలి. -ఈ సమయంలోనే ఉప్పు,కారం కావాలి అనుకుంటే యాడ్ చేసుకోవాలి. -గ్రేవీ చిక్కబడేంతవరకు ఓ 15 నిమిషాలు ఉడికించుకోవాలి. అంతే చికెన్ టాగిన్ రెడీ. దీనిని రోటీ,బ్రెడ్, చపాతీ వంటి వాటితో తింటే అద్భుతంగా ఉంటుంది.

## మిగిలిపోయిన అన్నంతో ఆలూ రైస్..



సాధారణంగా మన ఇళ్లల్లో అన్నం మిగిలిపోతే దానిని పులిహోరగానో లేదా టమాటో రైస్ గానే తయారుచేస్తుంటారు. మిగిలిపోయిన అన్నంతో చేసే వీటి రుచి అద్భుతంగా ఉంటుంది. అయితే మిగిలిపోయిన అన్నంతో చేసే ఆలూ రైస్ మీరెప్పుడైనా తిన్నారా? అబ్బో అదిరిపోతుందంతే. ఉంటే మిగిలిపోయిన అన్నంతో చేసుకోవచ్చు లేదంటే మామూలు అన్నంతో కూడా ఇది చేసుకోవచ్చు. దీనిని క్షణాల్లో రెడీ చేసుకోవచ్చు. లంచ్ బాక్సుల్లో పెట్టుకోడానికి లేదా ఇంటికి ఎవరైనా సడెన్ గా అతిథులు వచ్చినప్పుడు చేయడానికి పర్ఫెక్ట్ వంటకం ఇది. మిగిలిపోయిన అన్నంతో ఆలూ రైస్ ఎలా తయారుచేసుకోవాలో ఇప్పుడు చూద్దాం. ఆలూ రైస్ తయారీకి కావలసిన పదార్థాలు -బంగాళదుంప -అన్నం -ఉల్లిపాయ -టమాటో -కారం -జీలకర్ర పొడి -కొత్తిమీర -పుదీనా -అల్లం -పెరుగు -నిమ్మ రసం -ఉప్పు -ఆయిల్ -కరివేపాకు

ఆలూ రైస్ తయారీ విధానం -ముందుగా మిక్సీ గిన్నెలో 6 వెల్లుల్లి, అర ఇంచు అల్లం ముక్కలు, 3 పచ్చిమిర్చి ముక్కలు, ఒక చిన్న కొత్తిమీర కట్టని కాడలతో సహా వేయాలి,అందులోనే 1 చిన్న పుదీనా కట్ట, 3 టేబుల్ స్పూన్ల పెరుగు, అర చెక్క నిమ్మరసం,రుచికి తగినంత ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోసుకుంటూ మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 3 టేబుల్ స్పూన్ల ఆయిల్ పోసి వేడి చెయ్యండి. -ఆయిల్ వేడెక్కిన తర్వాత 2 బంగాళదుంపల చెక్కులు తీసి కట్ చేసి ముక్కలు వేసి లేత బంగారు గోధుమ రంగులోకి వచ్చేదాకా వేయించాలి. -తర్వాత అందులో 1 ఉల్లిపాయ చీలికలు వేసి మెత్తబడనివ్వాలి. ఇందులోనే 1 రెబ్బ కరివేపాకు కూడా వేసి వేయించాలి. -తర్వాత అందులో కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి టమాటోలపైన స్కిన్ మెత్తబడే వరకు వేయించండి. -టమాటోలు మగ్గుతున్న సమయంలోనే అందులో అర టీస్పూన్ కారం, అర టీస్పూన్ జీలకర్ర పొడి వేసి వేపండి. -మసాలాలు బాగా వేగిన తర్వాత ముందుగా గ్రైండ్ చేసి ఉంచుకున్న పేస్ట్ వేసి నీరు ఇగిరిపోయి చిక్కబడేంతవరకు కలుపుతూ వండండి. -తర్వాత అందులో మిగిలిపోయిన అన్నం లేదా పొడి పొడిగా వండుకున్న అన్నం వేసి కలపండి. -మంటను పెద్దగా ఉంచి రైస్ ను కలుపుతూ ఉండండి. అంతే నిమిషాల్లోనే ఆలూ రైస్ రెడీ. ఆలూ రైస్ ప్రయోజనాలుమిగిలిన అన్నంతో తయారుచేసే ఆలూ రైస్ రుచికరమైనదే కాకుండా ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. ఇందులో ఉపయోగించే బంగాళాదుంపలు, బియ్యం రెండూ శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లు, అలాగే కొన్ని ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటాయి. బంగాళాదుంపలలో విటమిన్ సి, పొటాషియం, ఫైబర్ ఉంటాయి. చల్లారిన అన్నంలో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది, ఇది ఒక రకమైన ఫైబర్, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది.. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా ఉపయోగపడుతుంది.

## ఇంట్లో ఏమీ లేకున్నా ఒక్క టమాటో ఉంటే చాలు.. అదిరిపోయే కుర్మా చేసుకోవచ్చు, ఎలా అంటే?



కొన్ని కొన్ని సందర్భాల్లో ఇంట్లో ఎలాంటి వస్తువులు లేనప్పుడు పచ్చి కారంతో అన్నం తింటూ ఉంటాము. ఆ సందర్భంలో అవి కూడా రుచిగా ఉన్నప్పటికీ ఆరోగ్యానికి అంత మంచిది కాదు అని చెప్పుకోవచ్చు. అలాగే చాలా మంది బ్యాచిలర్స్‌కి వంట ఎలా చేసుకోవాలో కూడా తెలియదు. దీని కారణంగా వారు బయటి నుంచి ఆహారం తీసుకొచ్చి తిని.. అనారోగ్యం బారిన పడుతుంటారు. అలాగే డబ్బులు కూడా ఎక్కువగా ఖర్చు చేస్తుంటారు. అలాంటి వారికోసమే ఓ చక్కటి రెసిపీ తీసుకొచ్చాను. ఇది చాలా సులభంగా చేసుకోవచ్చు. ఇంట్లో కేవలం ఒక్క టమాటో ఉంటే సరిపోతుంది. అదే టమాటో కుర్మా రెసిపీ. దీని రుచి అమోఘంగా ఉంటుంది. అలాగే చేసుకోవడం కూడా అత్యంత సులభమైన విషయం. వంట వండుకోవడం రాని వ్యక్తులు కూడా దీనిని సులభంగా చేసుకుంటారు. ఆ రెసిపీకి కావాల్సిన ఐటమ్స్ ఏంటి? అనేది ఈ స్టోరీలో వివరించాము.. చూసి మీరూ ట్రై చేయండి.

టమాటో కుర్మా తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి? టొమాటోలు – 2 (సన్నగా తరిగినవి) ఉల్లిపాయ – 1 (తరిగినది) కొబ్బరి తురుము – 1/4 కప్పు పచ్చిమిర్చి – 2 లేదా 3 (చీలికలుగా) అల్లం – అరకప్పు అంగుళం (తురిమినది) వెల్లుల్లి – 2 రెబ్బలు (తరిగినవి) ఆవాలు – 1/2 టీస్పూన్ జీలకర్ర – 1/2 టీస్పూన్ పసుపు – 1/4 టీస్పూన్ కారం – 1/2 టీస్పూన్ గరం మసాలా – 1/2 టీస్పూన్ ఉప్పు – రుచికి తగినంత నూనె – అవసరమైతే కొత్తిమీర – గుప్పెడు.

టమాటో కుర్మా తయారీ విధానం ఈ టమాటో కుర్మా తయారు చేసుకోవడం చాలా సులభం. ఇందుకోసం ముందుగా ఒక పాన్ తీసుకోవాలి. దానిని స్టవ్ మీద పెట్టి, అందులో నూనె వేసుకోవాలి. ఇప్పుడు బాగా వేడెక్కిన నూనెలో ఆవాలు, జీలకర్ర వేసుకోవాలి. అలాగే ఆ ఆవాలు, జీలకర్ర చిటపటాలాడేలా వాటిని వేయించుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో మనం ముందుగా సన్నగా తరిగి పెట్టుకున్న ఉల్లిపాయలు వేసుకోవాలి. అలాగే ఆ ఉల్లిపాయలు లేత బంగారు వర్ణంలోకి వచ్చేంత వరకు వాటిని బాగా ఫ్రై చేసుకోవాలి. ఉల్లిపాయలు బాగా ఫ్రై అయ్యాక.. అందులో అల్లం, వెల్లుల్లి ముక్కలు వేసుకోవాలి. ఆ తరువాత వాటి నుంచి పచ్చి పచ్చి వాసన అంతా బయటికి వెళ్లేలా వేయించుకోవాలి. తరువాత అందులో తరిగిన టొమాటోలు, పచ్చిమిర్చి, ఉప్పు వేసుకోవాలి. అవన్నీ బాగా మెత్తబడే వరకు బాగా ఉడికించుకోవాలి. ఇప్పుడు అందులో పసుపు, కారం, గరం మసాలా కూడా వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత అందులో కొబ్బరి తురుము కూడా వేసుకొని కలుపుకొని, మరో రెండు లేదా మూడు నిమిషాల పాటు కలుపుకొని ఉడికించుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీరు వేసి, కుర్మా సాస్‌లా తయారయ్యేలా చెయ్యండి. ఆ తరువాత దానిపై కొత్తిమీర చల్లి అలంకరించండి. అంతే ఎంతో రుచికరమైన వేడి వేడి టమాటో కుర్మా సిద్ధమైనట్లే.

# సినిమా న్యూస్




## రష్మికకు పోటీగా నోరా ఫతేహి.. బీట్ చేయగలదా?



ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వస్తున్న బాలీవుడ్ తాజా మూవీ థామా..ఈ సినిమా అక్టోబర్ 21న విడుదల కు సిద్ధంగా ఉండడంతో రీసెంట్ గా మడాక్ ఫిలిమ్స్ ఈ సినిమా ట్రైలర్ ని రిలీజ్ చేసింది. అయితే ఈ ట్రైలర్లో రష్మిక కంటే ఎక్కువ హైలైట్ అయింది మరో నటి. ఆమె ఎవరో కాదు నోరా ఫతేహి.. థామా ట్రైలర్ లో నోరా ఫతేహి గెస్ట్ రోల్ చేస్తున్నట్లు ట్రైలర్ చూసిన చాలామంది నెటిజన్స్ భావించారు.కానీ సడన్గా ఈ సినిమాలో గెస్ట్ రోల్ కాదు ఏకంగా ఓ స్పెషల్ సాంగ్ చేస్తున్నట్టు అఫీషియల్ గా బయటపడింది.తాజాగా నోరా ఫతేహి థామా మూవీలో 'దిల్బార్ కి ఆంఖోన్ కా'' అనే స్పెషల్ సాంగ్ చేస్తున్నట్టు ప్రకటించింది.అంతేకాదు ఈరోజు మధ్యాహ్నం థామ మూవీ నుండి నోరా ఫతేహి చేస్తున్న పాట కూడా రిలీజ్ అయింది. అయితే నోరా ఫతేహి చేసిన దిల్బార్ కి ఆంఖోన్ కా పాటని తాజాగా తన ఇన్స్టా ఖాతాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో చూసిన చాలా మంది నెటిజన్స్ నోరా ఫతేహి అందాలకు నోరెళ్ళ బెడుతున్నారు.

అంతేకాదు థామా సినిమాలో రష్మిక మందన్నా కంటే నోరా ఫతేహి తన అందంతో మెస్మరైజ్ చేస్తుందని, ఖచ్చితంగా రష్మికని పక్కకు నెట్టి నోరా ఫతేహి క్రేజ్ సంపాదిస్తుంది అంటూ కామెంట్స్ పెడుతున్నారు ఆమె అందానికి మంత్ర ముగ్ధులైనటువంటి నెటిజన్స్. మరి చూడాలి ఈ సినిమాలో స్పెషల్ సాంగ్లో చేసిన నోరా ఫతేహి మెయిన్ హీరోయిన్ గా చేసిన రష్మిక కంటే ఎక్కువ గుర్తింపు తెచ్చుకుంటుందా అనేది.. నోరా ఫతేహి థామా మూవీలో దిల్బార్ కి ఆంఖోన్ కా పాట గురించి మాట్లాడుతూ.. "బాలీవుడ్ లో గత కొద్ది రోజులుగా నా నుండి స్పెషల్ సాంగ్స్ రావడం లేదు.నేను చేసిన స్త్రీ -1మూవీలో కమారియా పాట నా జీవితాన్ని మార్చేసింది. అలాగే కమారియా, దిల్బర్ రెండు పాటలు కూడా ఒకేసారి షూటింగ్ జరుపుకున్నాయి. ఈ రెండు ఒకే నెలలో విడుదలయ్యాయి. అలా ఈ రెండు పాటల ద్వారా నేను బీటౌన్ లో ఫేమస్ అయ్యాను. తాజాగా నేను చేసిన థామా సినిమాలోని దిల్బార్ కి ఆంఖోన్ కా అనే పాట కూడా నాకు మరింత గుర్తింపుని తెస్తుంది.చాలా రోజుల నుండి నా అభిమానులు ఇలాంటి స్పెషల్ సాంగ్స్ లో నన్ను మిస్ అయ్యారు. కానీ థామా లోని స్పెషల్ సాంగ్ తో మళ్లీ ఆ వైబ్ ని తీసుకురాబోతున్నాను. ఇందులో మంచి హుక్ స్టెప్ ఉంది.మీరందరూ ఇష్టపడే నోరా ఫతేహి మళ్ళీ తిరిగి రాబోతుంది" అంటూ థామా సినిమాలోని స్పెషల్ సాంగ్ గురించి మాట్లాడింది.అలా తాజాగా విడుదలైన ఈ సాంగ్ తో నిజంగానే మునపటి నోరా ఫతేహిని చూస్తున్నామని ఆమె ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు. థామా సినిమా విషయానికి వస్తే..ఆదిత్య సర్పోత్దార్ డైరెక్షన్లో తెరకెక్కుతున్న రొమాంటిక్ కామెడీ హార్రర్ మూవీ థామా.. మాడాక్ హార్రర్ కామెడీ యూనివర్స్ లో ఐదో భాగంగా ఈ సినిమా రాబోతోంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా ,రష్మిక మందన్నాలు ప్రధాన పాత్రలో నటించగా.. నవాజుద్దీన్ సిద్ధికీ, రామ్ బజాజ్ గోయల్, పరేష్ రావల్,ఫైసల్ మాలిక్, సంజయ్ దత్, గీత అగర్వాల్ కీ రోల్స్ పోషించారు.

## దీపికకి అండగా త్రిప్తి.. అసలేం జరుగుతోంది?




ఒకప్పుడు ఫిలిం ఇండస్ట్రీలో హీరోయిన్స్ ఒకరికొకరు మద్దతు ఇచ్చేవారు కాదు అని అనుమానాలు ఫ్యాన్స్ వ్యక్తం అయ్యేవి. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను బట్టి చూస్తే.. హీరోయిన్స్ ఒకరికొకరు అండగా నిలుస్తున్నారు అని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన ముంబై ఈవెంట్లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఏకంగా యంగ్ హీరోయిన్స్ తో చక్కగా కలిసిపోయి.. వారి క్రేజ్ కు దోహదపడిన విషయం తెలిసిందే. మరి కొంతమంది.. తోటి హీరోయిన్స్ కి ఏదైనా ఇబ్బంది వస్తే అండగా నిలబడడానికి కూడా వెనకడుగు వేయడం లేదు. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా దీపికకు ఇండస్ట్రీలో వ్యతిరేకత వెలువడుతున్న నేపథ్యంలో ఇప్పుడు త్రిప్తి డిమ్రి ఆమెకు సపోర్ట్ చేయడం వైరల్ గా మారుతోంది. దీంతో అసలేం జరుగుతోందో అర్థం కావడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా 'యానిమల్' సినిమాతో సంచలనం సృష్టించిన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో హీరోయిన్గా దీపికా పదుకొనేను ఎంపిక చేసుకున్నారు. కానీ పని గంటలు, రెమ్యూనరేషన్ విషయంలో కాస్త విభేదాలు ఏర్పడడంతో దీపికాను తొలగించి ఆస్థానంలో త్రిప్తి డిమ్రిని తీసుకున్నారు. దీంతో అప్పటినుంచి దీపికా పదుకొనే - త్రిప్తి డిమ్రి ల మధ్య పడడం లేదు అంటూ వార్తలు రాగా.. సడన్ గా తృప్తి డిమ్రి చేసిన పనికి నెటిజన్స్ సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. సోషల్ మీడియాలో ఒక యూజర్ సినిమాలో దీపిక అంకితభావాన్ని తెలుపుతూ ఒక పోస్ట్ పెట్టారు. రామ్ లీలా సినిమాలో ఒక పాట కోసం దీపిక చాలా కష్టపడ్డారని.. 30 కేజీల బరువు ఉన్న లెహంగాను ధరించి డాన్స్ చేయడమే కాకుండా తన కాళ్లకు రక్తం వస్తున్నా.. ఆపకుండా నృత్యం చేశారని, ఆమె డెడికేషన్ కి ఎవరైనా ఫిదా అవుతారు అంటూ సదరు యూజర్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. అయితే ఇది కాస్త వైరల్ అవ్వడంతో ఈ పోస్టును త్రిప్తి లైక్ చేశారు. దీంతో దీపికాకు త్రిప్తి మద్దతు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది అంటూ దీపిక అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా స్పిరిట్ మూవీ నుండి దీపికాను తొలగించి త్రిప్తిని తీసుకున్నారు అని తెలిసిన తర్వాత ఇద్దరి మధ్య మాటలు లేవు అంటూ వచ్చిన వార్తలకు త్రిప్తి ఒక్క లైక్ తో చెక్ పెట్టింది అని చెప్పవచ్చు. సినిమా విషయానికి వస్తే.. సందీప్ రెడ్డి రూపొందిస్తున్న ఈ చిత్రం యాక్షన్ థ్రిల్లర్ గా రాబోతుంది. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి కాగా.. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్ 5 నుంచి ఈ సినిమా షూటింగ్ వేగంగా జరగబోతున్నట్లు సమాచారం.

## ఆ కేసులో హీరోయిన్‌ను విచారించిన పోలీసులు



బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్‌కుంద్రా ఎప్పుడూ ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తున్నారు. ఈ మధ్య కాలంలో వీరి గురించి వార్తలు లేవు అనుకుంటున్న సమయంలోనే మరో వివాదంతో వీరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. శిల్పా శెట్టి దంపతులపై ఇటీవల కేసు నమోదు అయింది. వ్యాపారవేత్త దీపక్ కొఠారి ఈ కేసును దాఖలు చేసిన విషయం తెల్సిందే. గతంలో శిల్పా శెట్టి దంపతులు బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహణలో భాగస్వామ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో దీపక్ కొఠారి నుంచి వ్యాపారం కోసం రూ.60 కోట్లను తీసుకున్నారట. ఆ డబ్బును బిజినెస్‌లో పెట్టకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నారని దీపక్ ఆరోపిస్తున్నారు. ఈ కేసు విషయమై తాజాగా శిల్పా శెట్టిని ముంబై పోలీసులు ఆమె ఇంట్లోనే విచారించారు. విచారణ సుదీర్ఘంగా సాగినట్లు తెలుస్తోంది.ముంబై మీడియా వర్గాలు, ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన పలు డాక్యుమెంట్స్ ను శిల్పా శెట్టి పోలీసుల ముందు ఉంచిందని, విచారణకు పూర్తిగా సహకరించిందట. అంతే కాకుండా ఆమె కేసుకు సంబంధించిన పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిందని తెలుస్తోంది. శిల్పా శెట్టి ఈ మధ్య కాలంలో పోలీసుల ముందుకు వెళ్లడం ఇదే మొదటి సారి ఏమీ కాదు. గతంలోనూ ఈమె కొన్ని కేసులు, ఆరోపణలు, ఆర్థిక అవకతవకల నేపథ్యంలో విచారణ ఎదుర్కొన్నట్లు మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెల్సిందే. ఈసారి ఆర్థిక పరమైన లావాదేవీలకు సంబంధించిన ఇష్యూ కావడంతో కాస్త ఎక్కువ సీరియస్‌గా వ్యవహారం సాగుతుంది అంటూ మీడియా సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఇదే కేసు విషయమై అతి త్వరలోనే రాజ్ కుంద్రాను పోలీసులు విచారించే అవకాశాలు ఉన్నాయి అంటూ ముంబై వర్గాల నుంచి సమాచారం అందుతోంది. ఆయన అందుబాటులో లేకపోవడం వల్లే మొదట శిల్పా శెట్టిని విచారించారని, త్వరలోనే ఆయన అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆయన్ను ఈ కేసు గురించి ముంబై పోలీసులు విచారిస్తారని తెలుస్తోంది. ఒకప్పుడు బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్‌లో పెట్టుబడి పెట్టిన వారు, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలకు డబ్బులు ఇచ్చిన వారు ముందు ముందు మరింత మంది వస్తారు అంటూ మరికొందరు అంటున్నారు. ఈ వ్యవహారం ముందు ముందు పెద్దదిగా మారే అవకాశాలు లేకపోలేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే శిల్పా శెట్టి సన్నిహితులు మాత్రం ఈ కేసు నిలవదని, దీపక్ కొఠారి ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అంటున్నారు.

## కింగ్ సెంచరీలో కీర్తి సురేష్!



కింగ్ నాగార్జున 100వ చిత్రం రా. కార్తిక్ దర్శకత్వంలో ప్రారంభమైన సంగతి తెలిసిందే. యాక్షన్ ప్రధానంగా సాగే చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. నాగార్జున వందవ సినిమా కావడంతో బయట నిర్మాణ సంస్థలు వేటికి అవకాశం ఇవ్వకుండా తానే స్వయంగా నిర్మించాలని నాగార్జున ముందే డిసైడ్ అయ్యారు. అనుకు న్నట్లే ప్రాజెక్ట్ గ్రాండ్ గా ప్రారంభమైంది. అయితే ఇందులో హీరోయిన్ ఎవరు? అన్నది ఫైనల్ కాలేదు. సాధారణంగా లాంచింగ్ రోజునే హీరోయిన్ కూడా ఈవెంట్ లో పాల్గొని దేవుడి పటాల ముందు కొబ్బరి కాయ కొడతారు. కానీ నాయిక ఎంపిక ఫైనల్ కాకపోవడంతో కార్యక్రమంలో గ్లామర్ కనిపించలేదు. మరి హీరోయిన్ ఛాన్స్ ఎవరికి ఇస్తున్నారు? అంటే మలయాళ బ్యూటీ కీర్తి సురేష్ పేరు తెరపైకి వచ్చింది. మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నారుట. హీరోయిన్ ఎంపిక విషయంలో నాగ్ ఇన్వాల్వ్ అయినట్లు చెబుతున్నారు. ఆయన ఆదేశాలతో పాటు పాత్రకు కూడా పర్ఫెక్ట్ గా సూటువుతుందని కార్తీక్ భావించడంతో కీర్తికి టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. నాగ్ సరసన పర్ఫెక్ట్ జోడీ అవుతుంది. అమ్మడు వయసు ఇప్పటికే 33 సంవత్సరాలు. సీనియర్ హీరోలతో పని చేసిన అనుభవం ఉంది. భోళాశంకర్‌లో చిరంజీవికి సోదరి పాత్రలో నటించింది. రవితేజ , నాని, మహేష్, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్లకు హీరోయిన్ గా నటించింది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com